సాక్షి కామారెడ్డి

బుధవారం । 4 । జూన్ । 2025



ఉద్యాన పంటలకు ఊతం

జిల్లాలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేం దుకు అధికారులు వార్షిక ప్రణాళికను రూపొందించారు.

- 8లో ▸



నాణ్యమైన విత్తనాలే వేయాలి

జిల్లాలోని పలు ప్రాంతాలలో నాణ్యమైన విత్తనం.. రైతన్నకు నేస్తం కార్యక్రమాలు నిర్వహించారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.0 /23.9

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణం పొడిగా మారుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

యోగా డే ను విజయవంతం చేయాలి



కామారెడ్డి అర్బన్ : ఈనెల 21 న నిర్వహించే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆర్డీవో వీణ సూచించారు. అంతర్జాతీయ యోగా దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం ఆయుష్ ఆధ్వర్యంలో పతంజలి యోగా అసోసియేషన్ సహకారంతో జిల్లా కేంద్రంలో యోగా వాక్ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు వాక్ సాగింది. ఇందిర చౌక్‌లో మానవ హారం నిర్వహించి యోగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ యోగాతో మానసిక, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. రోజూ యోగాసాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయుష్ డీపీఎం ఆకుల శ్రీకాంత్, వైద్యాధికారులు వెంకటేశ్వర్లు, దేవయ్య, నీలిమ, విజయ, చైతన్య, విజయలక్ష్మి, నహీద, యోగా గురువులు అంజయ్య గుప్తా, యెల్లంకి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

8న హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో పరుగు పోటీలు

కామారెడ్డి అర్బన్: సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 8న హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో పరుగు పోటీలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా యువజన, క్రీడల అధికారి జగన్నాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. 3, 5, 21 కిలోమీటర్ల పరుగు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తిగల అథ్లెట్లు 98494 93010 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'ప్రభుత్వ బడులలో చేర్పించాలి'



కామారెడ్డి టౌన్: పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించాలని డీఈవో రాజు తల్లిదండ్రులను కోరారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన 'ప్రభుత్వ బడులలో పిల్లలను చేర్పించండి -సంస్కారంతో పాటు నాణ్యమైన విద్యను పొందండి' బడిబాట పోస్టర్‌లను మంగళవారం జిల్లాకేంద్రంలోని డీఈవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న తపస్ జిల్లా శాఖను డీఈవో అభినందించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి, ప్రతినిధులు రామచంద్రం, లక్ష్మీపతి, ఆంజనేయులు, రాజశేఖర్, సత్యనారాయణ, పవన్ కుమార్, దత్తాచారి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు మంజూరు

కామారెడ్డి అర్బన్ : జిల్లాకేంద్రంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సు మంజూరైందని ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. కళాశాలలో ఇప్పటికే డిగ్రీలో బీఎస్సీ ఫిజికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, లైఫ్ సైన్స్, ఆనర్స్ కోర్సులున్నాయని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ 60 సీట్లతో ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కోర్సులో చేరాలనుకునేవారు దోస్త్‌లో ఈనెల 8 వరకు(కళాశాల కోడ్: 5009) ఆప్షన్ ఇవ్వాలని సూచించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన



బిచ్కుంద: మండల కేంద్రంలోని తక్కడ్‌పల్లి రోడ్డులో 300 ఏళ్ల నాటి పురాతన శివాలయ పునర్నిర్మాణం పూర్తయ్యింది. బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించనున్నారు. సుమారు 150 ఏళ్లుగా పూజలకు నోచుకోని ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావడానికి బిచ్కుందకు చెందిన జంగం నాగరాజ్ ముందుకు వచ్చారు. రూ. 40 లక్షల సొంత డబ్బులతో ఆలయాన్ని పునర్నిర్మించారు. గర్భగుడిలో ఆరడుగుల శిల్పాలున్నాయి. వాటిని అలాగే ఉంచి పక్కనుంచి కొత్తగా గోడలను నిర్మించారు. బుధవారం నుంచి మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తామని జంగం నాగరాజ్ తెలిపారు. బండాయప్ప మఠం పీఠాధిపతి శ్రీసోమాయప్ప స్వామీజీ చేతుల మీదుగా కార్యక్రమాలు సాగుతాయన్నారు.

నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో మృతదేహాల కోసం గాలిస్తున్న ఫైర్ సిబ్బంది, మృతుల బంధువులు



హర్షవర్ధన్ (ఫైల్) మధుకర్‌గౌడ్ (ఫైల్) నవీన్ (ఫైల్)

ఈతకు వెళ్లి.. విగతజీవిగా మారి..

- నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో మునిగి ముగ్గురి మృత్యువాత
- మూడు కుటుంబాల్లో తీరని విషాదం



రోదిస్తున్న మధుకర్‌గౌడ్ కుటుంబ సభ్యులు

ఎల్లారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్ : సరదాగా క్రికెట్ ఆడిన యువకులు.. ఈత కొట్టేందుకు నిజాంసాగర్ బ్యాక్ వాటర్ ప్రాంతానికి వెళ్లి నీట మునిగి మృతిచెందారు. ఈ ఘటన మూడు కుటుంబాలలో విషాదాన్ని నింపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలానికి చెందిన 11 మంది యువకులు సోమవారం సోమార్‌పేట్ గ్రామ శివారులో క్రికెట్ ఆడారు. అనంతరం స్నానం చేసేందుకు నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో దిగారు. వీరిలో ఎల్లారెడ్డికి చెందిన మధుకర్‌గౌడ్(17), సోమార్‌పేట్‌కు చెందిన హర్షవర్ధన్(17), తిమ్మారెడ్డికి చెందిన నవీన్(23) గల్లంతయ్యారు. మిగతావారు ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. గల్లంతైనవారి కుటుంబ సభ్యులు పోలీసుల సహకారంతో నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో గాలించేందుకు ప్రయత్నించినా అప్పటికే చీకటి పడడంతో వెనుదిరిగారు. మంగళవారం ఉదయం ఫైర్ సిబ్బందితో పాటు మృతుల బంధువులు నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో వలలతో గాలించారు. మొదట మధుకర్‌గౌడ్ మృతదేహం లభ్యమయ్యింది. మధ్యాహ్న సమయంలో నవీన్, హర్షవర్ధన్‌ల మృతదేహాలు లభించాయి. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం నిజాంసాగర్ పోలీసులు ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఒక్కగానొక్క కుమారుడు..

సోమార్‌పేట గ్రామానికి చెందిన గూల రాజలింగం దంపతులకు హర్షవర్ధన్ (17) ఒక్కడే కొడుకు. ఇంటర్ చదువుతూ అందరితో కలుపుగోలుగా ఉండేవాడు. సోమవారం సరదాగా ఆడుకోవడానికి వెళ్లి తిరిగి రాని లోకాలకు వెళ్లాడు. నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో మునిగి చనిపోవడంతో అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన కిషన్‌గౌడ్ పెద్ద కొడుకు మధుకర్‌గౌడ్ (17) ఇంటర్ చదువుతున్నాడు. తోటి వారితో ఆటపాటలతో సరదాగా ఉండేవాడు. స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్లిన మధుకర్.. నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి చనిపోవడంతో అతడి కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు.

మిన్నంటిన రోదనలు

గల్లంతైనవారి కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు బ్యాక్‌వాటర్ ప్రాంతానికి చేరుకున్నారు. చెట్టంత కొడుకులు కళ్లముందు విగత జీవులుగా కనిపించడంతో మృతుల కుటుంబ సభ్యులు తీవ్రంగా రోదించారు. వారి రోదనలు స్థానికులను కంట తడి పెట్టించాయి.

గాలింపు చర్యలను పట్టించుకోని అధికారులు

ముగ్గురు యువకులు గల్లంతైనా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ఫైర్ సిబ్బందితో పాటు మృతుల బంధువులు వలల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అధికారుల తీరుపై స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందించారు.



సంఘటన స్థలంలో విషణ్ణ వదనాలతో మృతుల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

అనారోగ్యంతో ఒకరు.. నీట మునిగి మరొకరు..

తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన ఐతె సామెల్ దంపతులకు ఇద్దరు కుమారులు. మతిస్థిమితం సరిగ్గాలేని పెద్ద కుమారుడు సాయిబాబు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. చిన్న కొడుకు నవీన్ బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. అతడైనా వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకుంటే.. సోమవారం నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో మునిగి చనిపోయాడు. ఇలా ఇద్దరు కుమారులు కళ్లముందే మరణించడంతో సామెల్ దంపతులకు తీరని గర్భశోకం మిగిలింది.

తిమ్మారెడ్డిలో విషాదఛాయలు

వేర్వేరు కారణాలతో కొద్దిరోజుల వ్యవధిలో తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు. పైచదువుల కోసం అమెరికాకు వెళ్లిన గోవర్ధన్(28).. అక్కడ గతనెల 29న అనుమానాస్పద స్థితిలో మరణించాడు. సోమవారం స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన నవీన్ (23) నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో నీట మునిగి మృతి చెందాడు. కొద్ది గంటల తేడాలోనే ఇద్దరు యువకుల మృతదేహాలు గ్రామానికి చేరుకున్నాయి. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



రోదిస్తున్న నవీన్ తల్లిదండ్రులు

కవిత అభిమానుల సోషల్ వార్

- లేఖలోనివి ఆరోపణలు కాదు.. నిజాలంటూ ప్రచారం
- 2019 నుంచే కవితపై జిల్లాలో కుట్రలు.. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయేలా చేశారంటున్న ఉద్యమకారులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కుమార్తె కవిత రాసిన లేఖ విషయమై ఉమ్మడి జిల్లాలో గులాబీ శ్రేణులు గుంభనంగా ఉన్నప్పటికీ ఉద్యమకారులు మాత్రం సోషల్ మీడియా వేదికగా స్వరం గట్టిగా వినిపిస్తున్నారు. లేఖలో కవిత రాసిన అంశాలు ఆరోపణలు కాదని, పచ్చి నిజాలంటూ సోషల్ మీడియాలో వరుస ప్రకటనలు చేస్తున్నారు. మా ధైర్యం మీరే కవితక్క, డాటర్ ఆఫ్ ఫైటర్ అంటూ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఉద్యమకారులైన కొందరు సీనియర్ కార్యకర్తలైతే మరింత ఘాటుగా సోషల్ వార్‌లోకి దిగారు. జిల్లాలో కవితపై 2018 నుంచే కుట్రలు మొదలయ్యాయని, 2019 లోక్‌సభ ఎన్నికల్లో కవిత ఓటమికి అప్పటి ఎమ్మెల్యేలే కారకులయ్యారని అందుకు తామే ప్రత్యక్ష సాక్షులమంటూ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తున్నారు. ఉద్యమకారులందరం కవిత వెంటే ఉంటామంటున్నారు. కవిత ఉనికిని ఓర్వలేని కొందరు మాజీ ప్రజాప్రతినిధులు.. పలువురు ఉద్యమకారులను పార్టీ నుంచి బయటకు వెళ్లేలా చేసినట్లు, కవితకు కమ్యూనికేట్ కాకుండా చేసినట్లు విమర్శలు గుప్పిస్తున్నారు. నగరానికి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే సోదరుడు షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించడమే కాకుండా కవిత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దు, మా సోదరుడి ఫొటోను మాత్రమే పెట్టుకోవాలంటూ బెదిరించినట్లు చెబుతున్నారు. ఈ మాజీ ఎమ్మెల్యే సోదరుడు షాడో మాదిరిగా వ్యవహరించడమే కాకుండా దళితబంధు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇతర పథకాల్లో చాలామంది వద్ద భారీగా డబ్బులు వసూలు చేశారని ఆరోపిస్తున్నారు.

పీఆర్‌వోనే లేఖ లీక్ చేసినట్లు సోషల్ మీడియాలో వీడియో వైరల్..

కవితకు పీఆర్‌వోగా ఉన్న రాజేష్ అనే వ్యక్తి కేసీఆర్‌కు రాసిన లేఖను లీక్ చేసినట్లు తాజాగా సోషల్ మీడియాలో వీడియో వైరల్ అవుతోంది. ఈ విషయమై కేటీఆర్, హరీశ్‌రావు టీములకు సాక్ష్యాధారాలతో పూర్తి వివరాలు తెలిసినట్లు వీడియోలో ఉంది. ఈ పీఆర్‌వోనే కవితకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని బయటకు విడుదల చేసినట్లు ఇందులో ఉంది. కేటీఆర్, హరీశ్‌రావులపై సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేయించినట్లు పేర్కొన్నారు. తాజాగా కాంగ్రెస్‌లోని ఓ నాయకుడికి కోవర్టుగా మారి, కేటీఆర్, హరీశ్‌రావులకు వ్యతిరేకంగా జాతీయ మీడియాలో ప్రశ్నలు అడిగేలా ఈ పీఆర్‌వో చేసినట్లు ఇందులో పేర్కొన్నారు. కవితను ఎక్కువగా జాతీయ మీడియాలో కనిపించాలని ప్రేరేపించినట్లు వీడియోలో వివరించారు. తాజాగా కవిత రాసిన లేఖను సైతం ఈ పీఆర్‌వో రాజేష్ తనకు సన్నిహితుడైన మీడియా పర్సన్ ద్వారా లీక్ చేసినట్లు పేర్కొన్నారు. జాతీయ మీడియా పేరిట కవిత వద్ద భారీగా డబ్బులు దండుకున్న ఇతను హైదరాబాద్ శివార్లలో విల్లా కొనుగోలు చేసినట్లు వైరల్ అవుతోంది. ఈ వీడియోను కేటీఆర్, హరీశ్‌రావులకు పంపినట్లు ఉద్యమకారులు చెబుతున్నారు.

'భూభారతి'తో సమస్యల పరిష్కారం

- ఈ నెల 20 వరకు రెవెన్యూ సదస్సులు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మాచారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మంగళవారం గజ్యానాయక్ తండాలోని రైతువేదికలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల భూ సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనికోసమే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు. 20 వ తేదీ వరకు సదస్సులు జరుగుతాయన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి రశీదు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, మండల ప్రత్యేకాధికారి రమేశ్, తహసీల్దార్ సరళ, ఎంపీడీవో గోపిబాబు, ఎస్సై అనిల్, వ్యవసాయాధికారి పవన్, ఎఫ్‌ఆర్‌వో దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మాచారెడ్డిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కలెక్టర్ భూమిపూజ చేశారు. లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. లబ్ధిదారులు నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గజ్యానాయక్ తండాలోని రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలి

కామారెడ్డి క్రైం : స్థానిక అవసరాల నిమిత్తం 1, 2, 3 నంబర్ల మంజీర క్వారీలలో తీసే ఇసుకపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంగ్వాన్ ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి ఎంత ఇసుక అవసరం ఉంటుంది, లభ్యత తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాలు తమకు కావలసిన ఇసుక కోసం తెలంగాణ ఖనిజ అభివృద్ధి సంస్థకు చెందిన ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, గనులు, భూగర్భ శాఖ ఏడీ నగేష్, ప్రాజెక్ట్ అధికారి విఠలేశ్వర్, ఈఈ రవిశంకర్, మిషన్ భగీరథ, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించాలి

కామారెడ్డి క్రైం: ఒకేసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిర్మూలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా అంతం చేద్దాం' నినాదంతో కూడిన వాల్‌పోస్టర్‌లను మంగళవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించవచ్చని సూచించారు. కార్యక్రమంలో డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీరు లక్ష్మణ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

కామారెడ్డి క్రైం : బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఈనెల 7న బక్రీద్ నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో ముస్లిం మత పెద్దలు, వివిధ శాఖల అధికారులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా ఏదైనా సమస్య ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గోవుల అక్రమ రవాణా జరగకుండా చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. గోవులను, వాహనాలను సీజ్ చేసిన సందర్భాల్లో గోవులను గోశాలకు తరలించడం, వాటికి ఆహారం అందించడం లాంటివి మున్సిపల్ శాఖ చూడాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వార్తల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర, అదనపు కలెక్టర్ విక్టర్, ఏఎస్పీ చైతన్యరెడ్డి, ఆర్డీవో వీణ, శాఖల అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి కోసం..

- బిచ్కుంద, ఎల్లారెడ్డి ఐటీఐ కాలేజీలను ఏటీసీలుగా మార్చిన సర్కారు
- ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ
- జిల్లాలో మరో రెండు ఏటీసీల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : విద్యార్థులలో నైపుణ్యాలను అభివృద్ధి చేసి బతుకుబాట చూపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఐటీఐ కళాశాలలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)లుగా అప్‌గ్రేడ్ చేస్తోంది. జిల్లాలో ఇప్పటికే బిచ్కుంద, ఎల్లారెడ్డిలలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చింది. మిగిలిన రెండు నియోజకవర్గాలలోనూ ఏటీసీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాగా ఆయా కళాశాలల్లో వివిధ కోర్సులలో ప్రవేశాలకోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈనెల 21 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు.

ఏటీసీల్లోని కోర్సులు, సీట్ల వివరాలు..

బిచ్కుంద ఏటీసీలో మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ టెక్నీషియన్ కోర్సులలో 40 సీట్ల చొప్పున ఉన్నాయి. ఏడాది వ్యవధిగల ఈ 2 కోర్సులకు పదో తరగతి చదివిన వారు అర్హులు.

- ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ కోర్సులో 20 సీట్లు ఉన్నాయి. పదో తరగతి చదివిన వారు అర్హులు. ఇదీ ఏడాది కోర్సే.
- బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైర్ (మెకానిక్), అడ్వాన్స్‌డ్ సీఎస్‌సీ మిషనింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ కోర్సులలో 24 చొప్పున సీట్లు ఉన్నాయి. రెండేళ్ల కాలవ్యవధిగల ఈ కోర్సులకు పదో తరగతి చదివినవారు అర్హులు.
- ఎల్లారెడ్డి ఏటీసీలో కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ కోర్సులో 19 సీట్లు ఉన్నాయి.

ప్రైవేట్ కళాశాలల్లో..

- ఎల్లారెడ్డిలోని ఆదిత్య ఐటీఐ కళాశాలలో ఫిట్టర్ కోర్సులో 20 సీట్లు, డీజిల్ మెకానిక్ కోర్సులో 24 సీట్లున్నాయి.
- కామారెడ్డిలోని ఇంజినీర్స్ ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్ కోర్సులో 20 సీట్లు ఉన్నాయి.
- కామారెడ్డిలోని శ్రావణి ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్ కోర్సులో 120 సీట్లు, ఫిట్టర్ కోర్సులో 20 సీట్లు, డీజిల్ మెకానిక్ కోర్సులో 48 సీట్లు ఉన్నాయి.
- బాన్సువాడలోని శ్రీ బాలాజీ ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రీషియన్ కోర్సులో 80 సీట్లు, డీజిల్ మెకానిక్ కోర్సులో 24 సీట్లు, రేడియాలజీ టెక్నీషియన్ కోర్సులో 20 సీట్లు, సియూంగ్ టెక్నాలజీలో 40 సీట్లు ఉన్నాయి.

దరఖాస్తు విధానం...

- పదో తరగతి/ఎనిమిదో తరగతి పాస్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 ఆగస్టు 1 నాటికి 14 ఏళ్ల వయసు కలిగి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
- ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఒకే దరఖాస్తు ద్వారా రాష్ట్రంలోని ఏదైనా ఐటీఐ/ఏటీసీకి వెబ్ ఆప్షన్లను ఎంచుకునే అవకాశం ఉంది. https://iti.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు ఫీజు వంద రూపాయలు చెల్లించాల్సి ఉంటుంద. ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ తప్పనిసరి ఇవ్వాలి. దరఖాస్తులో ఇచ్చిన సమాచారం మారితే సీటు రద్దయ్యే అవకాశం ఉంటుంది. ఎంపికైన అభ్యర్థుల రిజిస్టర్డ్ మొబైల్ నంబరుకు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతుంది.

మంచి భవిష్యత్తు ఉంటుంది



ప్రభుత్వం విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మారుస్తోంది. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లలో అందిస్తున్న కోర్సుల్లో చేరినవారికి మంచి భవిష్యత్ ఉంటుంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– ప్రమోద్‌కుమార్, ప్రిన్సిపల్, ఏటీసీ, బిచ్కుంద

క్లుప్తంగా

టీసీసీ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు(టీసీసీ) పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో తీసుకోవాలని డీఈవో ఎస్. రాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు సూచించారు.

చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

కామారెడ్డి అర్బన్: వానాకాలం నేపథ్యంలో చెరువులు, కుంటలు, కాలువల్లోకి వెళ్లడం, ఈత కొట్టడం, చేపలు పట్టడం చేయకూడదని ఆయా గ్రామపంచాయతీలు, పురపాలక సంఘాలు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర చందర్ ఆదేశించారు. చెరువుల వద్దకు పిల్లలను ఎట్టి పరిస్థితుల్లో వెళ్లకుండా తగిన హెచ్చరిక బోర్డులుండాలని, ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు.

కరెంట్ షాక్‌తో క్యాజువల్ లేబర్‌కు గాయాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని వెంకంపల్లి గ్రామశివారులో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు పనులు చేస్తున్న క్యాజువల్ లేబర్ మండలంలోని గోపాల్‌పేటకు చెందిన బోయిని యాదగిరి తీవ్రంగా గాయపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని తాండూర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల వెంకంపల్లి గ్రామశివారులోని ఎస్.ఎస్.నం.2 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయిందని గ్రామస్తులు ధర్మారెడ్డి లైన్‌మెన్ మన్సూర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో లైన్‌మెన్ మన్సూర్ వెంకంపల్లి ఫీడర్‌కు ఎల్‌సీ ఇవ్వాల్సిందిగా ఫోన్‌ద్వారా తాండూర్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ రవిని కోరారు. కాగా సబ్‌స్టేషన్ ఆపరేటర్ రవి వెంకంపల్లి ఫీడర్‌కు కాకుండా ధర్మారెడ్డి ఫీడర్‌కు ఎల్‌సీ ఇచ్చినట్లు లైన్‌మెన్ తెలిపారు. ఈ విషయం తెలియని యాదగిరి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు పనులు చేసే క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన యాదగిరిని చికిత్సనిమిత్తం మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం యాదగిరిని హైదరాబాద్‌కు తరలించారు.

ఉద్యానపంటలకు ఊతం

- 2025-26 వార్షిక ప్రణాళిక ఖరారు
- పథకాల ద్వారా రైతులకు రాయితీలు
- డివిజన్‌స్థాయి అధికారులకు బాధ్యతల అప్పగింత





పందిరి ద్వారా చేపట్టిన సోరకాయ సాగు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఉద్యానపంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి సంబంధించి వార్షిక ప్రణాళికను ఖరారు చేసింది. ఈ క్రమంలో సమీకృత అభివృద్ధి మిషన్(యంఐడీహెచ్), రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) పథకాల ద్వారా రైతులకు లబ్ధి చేకూర్చేందుకు అవసరమైన నిధులను కేటాయించింది. ఉద్యాన పంటల సాగు ద్వారా తక్కువ ఖర్చుతో అధికలాభాలు ఆర్జించవచ్చనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తుంది. పంటమార్పిడి దిశగా అడుగులు వేసేలా రైతులకు రాయితీలు కల్పిస్తుంది.

రాయితీపై బిందు సేద్యం పరికరాలు

ఉద్యాన పంటలతోపాటు కూరగాయలు, పండ్ల మొక్కలను సాగు చేసేందుకు ప్రభుత్వం రాయితీపై బిందుసేద్యం పరికరాలను అందజేస్తుంది. ఉద్యానపంటలతోపాటు ఇతర పంటలను సాగు చేసేందుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీ చిన్న సన్నకారు రైతులకు 90శాతం, ఇతరులకు 80శాతం రాయితీ కల్పిస్తుంది. రాయితీపై బిందుసేద్యం పరికరాలు పొందాలనుకునే రైతులు వాటాధనంతోపాటు బీఎస్టీ కలిపి డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుకు 2500ఎకరాలు, కూరగాయలు, పండ్లమొక్కలతోపాటు మల్బరీ, మొక్కజొన్నవంటి పంటలను సాగుచేసేందుకు మరో 2వేల ఎకరాలకు బిందుసేద్యం పరికరాలను అందించాలని అధికారులు నిర్ణయించారు. ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ఎకరాకు రూ.4,200 చొప్పున నాలుగేళ్లపాటు నిర్వాహణ ఖర్చులు చెల్లించనున్నారు.

పందిళ్లసాగుకు 50 యూనిట్లు

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా జిల్లాలో శాశ్వత పందిళ్ల సాగు చేపట్టేలా ఉద్యానశాఖ అధికారులు రైతులను ప్రోత్సహించనున్నారు. తీగజాతి కూరగాయలను సాగుచేసే రైతులు రూ.లక్షతో అరఎకరంలో శాశ్వత పందిరిని ఏర్పాటు చేసుకుంటే ఉద్యానశాఖ ద్వారా రూ.50వేల రాయితీ వస్తుంది. జిల్లాకు మొత్తం 50యూనిట్లను కేటాయించినట్లు ఉద్యానశాఖ అధికారులు తెలిపారు.

వెదురుసాగుకు నిర్వహణ ఖర్చులు

జాతీయ వెదురు పథకం ద్వారా వెదురు సాగు చేసే రైతులకు రెండేళ్లపాటు నిర్వహణ ఖర్చులను చెల్లించనున్నారు. జిల్లాలో 50 ఎకరాల్లో వెదురును నాటాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. వెదురును సాగుచేసే రైతులకు ఎకరానికి మొదటి సంవత్సరం రూ. 14,400, రెండో సంవత్సరం రూ.9,600 చొప్పున నిర్వాహణ ఖర్చులను చెల్లించనున్నారు.

రాష్ట్రీయ ఉద్యాన మిషన్‌కు 844 ఎకరాలు

జిల్లాలో రాష్ట్రీయ ఉద్యాన మిషన్ పథకం ద్వారా 844 ఎకరాల పంటలకు రాయితీలు కల్పించనున్నారు. ఇందులో డ్రాగన్ ఫ్రూట్, మామిడి, బొప్పాయి, నిమ్మ, జామ, దానిమ్మ, బత్తాయి, అవకాడో, అంజీర్ తదితర పంటలసాగుకు రాయితీలు ఇవ్వనున్నారు.

ఉద్యానశాఖ ద్వారా ఈఏడాది జిల్లాకు కేటాయించిన నిధుల వివరాలు

డ్రిప్	291.87హెక్టార్లు	రూ.333.53లక్షలు
స్ప్రింక్లర్	167.84హెక్టార్లు	రూ. 31.56లక్షలు
ఆర్‌కేవీవై	50యూనిట్లు	రూ. 25లక్షలు
వెదురు	50 బ్లాక్స్	రూ.7.20లక్షలు
ఆయిల్ పామ్	2500 హెక్టార్లు	రూ.346లక్షలు

సంప్రదించాల్సిన అధికారుల వివరాలు

వార్షిక ప్రణాళిక ప్రకారం ఉద్యానపంటల సాగు లక్ష్యాన్ని నెరవేర్చడం కోసం ఉద్యానశాఖలోని డివిజన్‌స్థాయి అధికారులకు మండలాలవారీగా ప్రత్యేకంగా బాధ్యతలు అప్పగించారు. వారి వివరాలు...

అధికారి పేరు	ఫోన్ నంబర్	కేటాయించిన మండలాలు
సంతోషిరాణి	89777 14030	కామారెడ్డి, బీబీపేట, దోమకొండ, రాజంపేట, మాచారెడ్డి, భిక్కనూర్.
కమలాకర్ రెడ్డి	89777 14022	ఎల్లారెడ్డి, లింగంపేట, తాడ్వాయి, గాంధారి, రామారెడ్డి, సదాశివనగర్, నాగిరెడ్డిపేట.
సుమన్	89777 14029	జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, నిజాంసాగర్, పిట్లం, పెద్దకొడప్‌గల్, బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్.

అధికారులకు బాధ్యతలు అప్పగించాం



ఉద్యానశాఖ వార్షిక ప్రణాళికను అమలు చేసేందుకు ఈ ఏడాది ప్రత్యేకంగా ముగ్గురు అధికారులకు బాధ్యతలు అప్పగించాం. జిల్లావ్యాప్తంగా ఉద్యానపంటలు సాగు చేస్తున్న రైతులను గుర్తించి వారికి పథకాలను వివరిస్తాం. వివిధ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు ఉద్యానపంటలు సాగుచేసే రైతులకు అందేలా చర్యలు తీసుకుంటాం. – జ్యోతి, జిల్లా హార్టికల్చర్, సెరికల్చర్ అధికారిణి, కామారెడ్డి

ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన

మీకు తెలుసా?



భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ), ఇతర బీమా కంపెనీలు ఏడాదికి రూ. 436 ప్రీమియంతో బీమాను అందిస్తున్నాయి.కుటుంబంలో ప్రతి ఒక్కరూ చేరవచ్చు. మరణం ఎలా సంభవించిన రూ.2 లక్షల బీమా సొమ్మును నామినీకి చెల్లిస్తారు. ఈపథకంలో ఒకసారి చేరితే 55 ఏళ్ల వరకు కొనసాగుతుంది. ఎలాంటి మెచ్యూరిటీ ఉండదు.

- ఏదేని బ్యాంకులో సేవింగ్ ఖాతా ఉన్న 18 నుంచి 50 ఏళ్ల లోపు ఆధార్ కార్డు జిరాక్స్ అందజేసి పీఎంజేజేబీవైలో చేరవచ్చు. 50 ఏళ్లలోపు వారు చేరితే 55 ఏళ్ల వరకు పథకం కొనసాగుతుంది.
- ఏడాది కాలంలో ఏ నెలలో అయినా స్కీంలో చేరవచ్చు. ఖాతాలో సరైన డబ్బు నిల్వ ఉంటే ప్రతి సంవత్సరం మే నెలలో ప్రీమియం ఆటో డెబిట్ అవుతుంది.
- రోజుకు ఒకరూపాయి 20 పైసలతో రెండు లక్షల జీవిత బీమా.
- స్కీంలో చేరడానికి ఎలాంటి వైద్య పరీక్షలు అవసరం లేదు.

– కామారెడ్డి అర్బన్

అటెన్షన్ ప్లీజ్..

ఊరుస్తున్న తహసీల్ పైకప్పు



తహసీల్ కార్యాలయం పైకప్పు దుస్థితి

బాన్సువాడ రూరల్: దశాబ్దాల క్రితం నిర్మించిన బాన్సువాడ తహసీల్ కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. కార్యాలయ బాల్కనీలో పై పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం కురిసినప్పుడు పైకప్పు ఊరుస్తోంది. గోడలు పాకురుపడుతున్నాయి. బంగ్లాపైన మర్రి మొక్కలు పెరిగాయి. పంట పొలాల రిజిస్ట్రేషన్లు, ఇతర పనుల నిమిత్తం కార్యాలయానికి ప్రజలు, కార్యాలయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు

- అర్హులైన వైద్యులు మాత్రమే స్కానింగ్ చేయాలి
- డీఎంహెచ్‌వో చంద్రశేఖర్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్: జిల్లాలోని స్కానింగ్ సెంటర్‌లలో లింగ నిర్ధారణ పరీక్షలు జరిపినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో మంగళవారం ప్రి కాన్సెప్షన్ మరియు ప్రి నెటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్(పీసీపీఎన్‌డీటీ) జిలా స్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ సెంటర్లు పీసీపీఎన్‌డీటీ ఫామ్ ఎఫ్‌ను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. తర్వాఎఫ్ సర్టిఫికెట్లను డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రతి నెల అందజేయాలని ఆదేశించారు. పోగ్రాం ఆఫీసర్ అన్ని స్కానింగ్ సెంటర్స్‌లను పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి స్కానింగ్ కేంద్రాలలో తప్పనిసరిగా పీసీపీఎన్‌డీటీ చట్టం సంబంధించిన పోస్టర్లు, స్కానింగ్ రుసుము వివరాలను అతికించాలని చెప్పారు. సీసీ కెమరాలు బిగించుకోవాలన్నారు. పని చేయనటువంటి స్కానింగ్ యంత్రాలు ఉంటే, రిజిస్ట్రేషన్‌లో మార్పులు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అర్హులైన వైద్యులు మాత్రమే స్కానింగ్ చేయాలని లేకుంటే కేంద్రాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో జిల్లా పోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనురాధ, వైద్యాధికారులు విజయశీల, శిరిష, లీగల్ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



సోమార్‌పేట్‌లో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



ఓదారుస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల..

ఎల్లారెడ్డిరూరల్/ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మండలంలోని సోమార్‌పేట్ గ్రామ శివారులో గల నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో నీట మునిగి మృతి చెందిన ముగ్గురు యువకుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం త్వరగా పూర్తి చేసి కుటుంబ సభ్యులకు మృత దేహాలను అప్పగించారు. అనంతరం వారి ఇంటికి వెళ్లి ఓదార్చారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చర్యలను తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిబాబా, కుడుముల సత్యనారాయణ, ప్రశాంత్‌గౌడ్, విద్యాసాగర్, నునుగొండ శ్రీనివాస్, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు. అలాగే నీట మునిగి మృతి చెందిన ముగ్గురి యువకుల కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరవింద్, ఇమ్రాన్, మండల పార్టీ అధ్యక్షులు జలందర్‌రెడ్డి, సతీష్ తదితరులున్నారు.

అమెరికాలో మృతి చెందిన యువకుడి కుటుంబ సభ్యులకు..

తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన యువకుడు గోవర్ధన్ అమెరికాలో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఓదార్చారు. గోవర్ధన్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు.

క్రైం కార్నర్

తిమ్మారెడ్డికి చేరిన యువకుడి మృతదేహం



ఎల్లారెడ్డి: మండలంలోని తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన గూల గోవర్ధన్ (28) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంది. గత నెల 29న గోవర్ధన్ అమెరికాలోని ఒకాయోలో అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. గోవర్ధన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబానికి ఆసరాగా నిలవాల్సిన కొడుకు మృతితో తండ్రి విఠల్ రోదనలు అందరినీ కలచివేశాయి. గోవర్ధన్ అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ హాజరయ్యారు.

12 కిలోల గంజాయి పట్టివేత

- రైలులో తరలిస్తుండగా గుర్తించిన ఎక్సైజ్, రైల్వే పోలీసులు



కామారెడ్డి క్రైం: రైలులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎక్సైజ్ సీఐ సంపత్ క్రిష్ణ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు వెళ్తున్న నాగావలి ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో ఎక్సైజ్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు కామారెడ్డిలో రైలు ఆగగానే తనిఖీలు చేపట్టారు. ఓ అనుమానాస్పద బ్యాగులో 12 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఎవరనేది తెలియలేదు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్సై విక్రమ్, ఆర్‌పీఎఫ్ ఎస్సై వెంకటేశ్వర్లు, ఏఎస్సై రవీంద్ర బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీ భూమిని ఆక్రమించిన ఇద్దరిపై కేసు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని గుడివెనుక తండాకు చెందిన బానోత్ రంగు, సోమారం తండాకు చెందిన జాట్రోత్ శ్రీనుపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. రెండు రోజుల క్రితం వీరిద్దరూ అటవీ భూమిని ట్రాక్టర్లతో దున్నుతుండగా అడ్డుకునే ప్రయత్నం చేసిన అటవీ శాఖ సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారన్నారు. అటవీ శాఖ సిబ్బంది ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసిట్లు తెలిపారు. ఎవరైనా అటవీ భూమిని ఆక్రమించినా, ఆక్రమించే ప్రయత్నం చేసినా వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం హంగర్గ గ్రామ శివారులో సోమవారం రాత్రి గుర్తులియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్, ఆయిల్‌ను అపహరించుకు వెళ్లారని బాధిత రైతులు తెలిపారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై రంజిత్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో 44 వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నర్సయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

నిజాంసాగర్(జుక్కల్): బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని జుక్కల్ ఎస్సై భువనేశ్వర్ సూచించారు. మంగళవారం జుక్కల్ మండల కేంద్రంలో బక్రీద్ పండుగ నిర్వహణపై నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పండుగలను సామరస్యంగా జరుపుకోవాలని సూచించారు.

ఘరానా దొంగల ముఠా అరెస్ట్

- 39 దొంగతనాలకు పాల్పడిన 8 మంది నిందితులు
- 15 తులాల బంగారం, 4 వాహనాల స్వాధీనం
- సీసీ ఫుటేజీ ఆధారాలతో కేసు ఛేదన
- సీపీ పోతరాజు సాయిచైతన్య వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సాయి చైతన్య

ఖలీల్‌వాడి: జిల్లాలో చోరీలకు పాల్పడిన ఘరానా దొంగల ముఠా సభ్యులను సీసీ ఫుటేజీల ఆధారంగా పట్టుకున్నట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ మాట్లాడారు. నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు ఇళ్లలో చోరీలకు పాల్పడిన కేసులు నమోదయ్యాయి. దీంతో పోలీసులు ఘటన స్థలంలోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, ఆధారాలను సేకరించి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అమేర్‌పై అనుమానం రావడంతో ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. అమేర్ చిన్నతనంలో పిక్ ప్యాకెట్లకు పాల్పడేవాడని, దొంగతనాలు చేసేటప్పుడు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్ ఆసిఫ్‌తో పరిచయం ఏర్పడింది. అబ్దుల్ ఆసిఫ్ తనకు పరిచయం ఉన్న వసీం, సోహైల్, జావీద్ ఖాన్, రియాజ్, అలీ, ఆసిఫ్ ఖాన్‌ను మహమ్మద్ అమేర్‌కు పరిచయం చేశాడు. వీరంతా గతంలో నేరాలకు పాల్పడినవారే. అందరూ కలిసి ఒక ముఠాగా ఏర్పడి పక్కా ప్రణాళికతో దొంగతనాలు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ముఠా సభ్యుల నగరంలోని ఆటోనగర్, ధర్మపురిహిల్స్, పెయింటర్ కాలనీ, డ్రైవర్ కాలనీ, అక్బర్‌నగర్ కాలనీ, శాంతినగర్‌లలో సుమారు 24 ఇండ్ల తాళాలు పగలగొట్టి దొంగతనాలు చేశారు. దొంగిలించిన బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను షేక్ వసీంకు ఇచ్చేవారు. వసీం వాటిని నిజామాబాద్ రూరల్ మండలంలోని మోహన్‌కు అమ్మేవాడు. మోహన్ వస్తువులను తక్కువ ధరకు కొనుగోలు చేసేవాడు. వచ్చిన నగదును అందరూ కలిసి పంచుకునేవారు. వీరు హైదరాబాద్ శివార్‌లోని షాపూర్, జీడిమెట్ల పరిసర ప్రాంతాలలో 15 ఆటోలను కూడా దొంగతనం చేశారు. ముఠాసభ్యుల్లో షేక్ వసీంపై 8 కేసులు ఉండగా మీర్‌పేట్‌లో పీడీయాక్ట్ నమోదు చేశారు. షేక్ సోహైల్ అలియాస్ చార్‌పాట్ సోహైల్‌పై గతంలో 7 కేసులు, మహమ్మద్ అమేర్‌పై 21 కేసులు, మహమ్మద్ అబ్దుల్ ఆసిఫ్‌పై 10 కేసులు, జావీద్ ఖాన్ 5 కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. ముఠా సభ్యులపై నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, హైదరాబాద్ నగరాలలో కేసులు నమోదైనట్లు సీపీ వెల్లడించారు. బంగారం కొనుగోలు చేసిన మోహన్‌పై కేసు నమోదు చేశామన్నారు. నిందితుల నుంచి 15 తులాల బంగారం, నాలుగు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసులో బబ్లూ, అలీ అనే నిందితులు పరారీలో ఉన్నారని, మిగతా వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. కేసు ఛేదనకు కృషి చేసిన సీఐ సురేశ్, ఎస్సై వెంకట్రావు, కానిస్టేబుళ్లను అభినందించి, రివార్డు అందజేశారు.

మహిళ హత్య కేసు ఛేదన



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్ రెడ్డి

బాల్కొండ: నందిపేట్ మండలం అయిలాపూర్ శివారులో గత నెల 26న జరిగిన మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. బాల్కొండ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. నందిపేట్ మండలం శాపూర్‌కు చెందిన సాద సుమలత(42) గత నెల 26న కూరగాయల కోసం మండల కేంద్రంలో నిర్వహించే సంతకు వచ్చింది. మార్కెట్‌లో ఆలూర్ మండల కేంద్రానికి చెందిన వేల్పుల పెద్ద గంగాధర్‌తో పరిచయం ఏర్పడింది. సుమలతను అయిలాపూర్ శివారులోని వంతెన వద్దకు తీసుకెళ్లిన గంగాధర్.. అత్యాచారానికి యత్నించాడు. సుమలత విభేదించడంతో చీర కొంగుతో గొంతు నులిమి హత్య చేశాడు. 27న సుమలత శవమై కనిపించడంతో కొడుకు సాద సంజీవ్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానంతో కేసును ఛేదించారు. మంగళవారం మధ్యాహ్నం నిందితుడు గంగాధర్ ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో బాల్కొండ మండలం చిట్టాపూర్ చౌరస్తా వద్ద పోలీసులు అదుపులోకి తీసుకొని కోర్టులో ప్రవేశపెట్టినట్లు సీఐ తెలిపారు. కేసును ఛేదించిన నందిపేట్ ఎస్సై చిరంజీవి, సిబ్బందిని సీఐ అభినందించారు. కాగా, గంగాధర్‌పై గతంలో మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసుతోపాటు దొంగతనం కేసు కూడా నమోదైంది.

టిప్పర్ ఢీకొని ఒకరి మృతి



లక్ష్మణ్ (ఫైల్)

మాక్లూర్ : ఎదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్సెల్‌ను టిప్పర్ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని మాదాపూర్, బొంకన్‌పల్లి గ్రామాల మధ్య లో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. రోడ్డు ప్రమాదానికి టిప్పర్ అతివేగమే కారణమని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జన్నెపల్లి నుంచి మాదాపూర్ వైపు వెళ్తున్న టిప్పర్.. ఎదురుగా టీవీఎస్ ఎక్సెల్‌పై వస్తున్న ముల్లంగి (బి) గ్రామానికి చెందిన భూలోళ్ల నడిపి గంగాధర్ అలియాస్ లక్ష్మణ్ (65)ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కొడుకు రాజు ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో జారిపడి యువకుడు..

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని చెరువులో జెట్టి గోపాల్ (21) మృతదేహం మంగళవారం లభ్యమైంది. కూలి పనులు చేసే గోపాల్ గత నెల 31న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు వెతుకుతుండగా స్థానిక చెరువులో మృతదేహం లభించింది. స్నానం చేసేందుకు వెళ్లిన గోపాల్ ప్రమాదవశాత్తు చెరువులో జారపడి ఉంటాడని మృతుడి సోదరి సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

జంతుమాంసం తరలిస్తున్న ఆటో పట్టివేత

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోచారంలో గుర్తుతెలియని జంతుమాంసాన్ని తరలిస్తున్న ఆటోను మంగళవారం ఉదయం గ్రామస్తులు పట్టుకొని చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులకు అప్పగించారు. బక్రీద్ నేపథ్యంలో మండలంలోని పోచారం వద్ద 20 రోజుల క్రితం పోలీసులు చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశారు. కాగా, మండలంలోని గోపాల్‌పేటకు చెందిన ఓ వ్యక్తి మంగళవారం గుర్తుతెలియని జంతుమాంసాన్ని ముక్కలుగా చేసి సంచులలో నింపుకొని కిరాయి ఆటోలో చెక్‌పోస్టు ఉన్న దారిలో కాకుండా మరో దారిగుండా వెళ్తుండగా గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

పరస్పర దాడులు

- ఆరుగురి రిమాండ్

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులోని నందిని రైస్‌మిల్‌కి వెళ్లే దారి విషయంలో మిల్లు యజమానులు, చుట్టుపక్కల పొలాల వారు సోమవారం పరస్పర దాడులు చేసుకున్నట్లు ఎస్సై స్రవంతి తెలిపారు. పాత గొడవలను మనసులో పెట్టుకొని ముత్యంపేటకు చెందిన ఆశపోయిన శ్రీనివాస్, అతని తమ్ముళ్లు గంగరాములు, స్వామితోపాటు అదే గ్రామానికి చెందిన కొత్తపల్లి నరేశ్, మల్లు రాజు, నాయని నాగరాజు, అతనికి వరుసకు తమ్ముడైన గుర్రాల వేణుగోపాల్ తదితరులు కలిసి రైస్‌మిల్ యజమానులను కర్రలతో కొట్టి గాయపర్చారు. తమను చంపేందుకు ప్రయత్నించారని మిల్లు యజమాని రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దాడులు చేసిన గుర్తించి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.